# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. దేశ ఆరోగ్య సంరక్షణ అభివృద్ధిలో ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తోందన్న రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్.**

**2. ఓటర్ల జాబితా సవరణ పై అధికారులకు, ప్రజాప్రతినిధులకు దిశా నిర్దేశం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..**

**3. తప్పిపోయిన వారిని గుర్తించడంలో 'ఆపరేషన్ ట్రేస్' కార్యక్రమం విశేష ఫలితాలు సాధిస్తోందని తెలిపిన హోంమంత్రి వి. అనిత.**

**4. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే దిశగా ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్.**

==========================

ఆరోగ్య విద్యా రంగంలో ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం దేశానికి మార్గదర్శక సంస్థగా నిలుస్తోందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ వార్షిక స్నాతకోత్సవాలలో గవర్నర్ ఈరోజు పాల్గొని విద్యార్థులకు పట్టాలను అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, ఈ విశ్వవిద్యాలయం రాష్ట్రంతో పాటు దేశంలో ఆరోగ్య సంరక్షణ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. తమ వృత్తిపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధమైన నూతన వైద్య, ఆరోగ్య నిపుణులను సమాజానికి అందించే కీలక ఘట్టం స్నాతకోత్సవమని తెలిపారు. వైద్య విద్యలో నాణ్యత, సేవా దృక్పథం, మానవతా విలువలను విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కొనసాగించాలని గవర్నర్ పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా– SIRపై గుంటూరు జిల్లా మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న కార్యశాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణపై ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. అలాగే ఈరోజు మధ్యాహ్నం జరిగే సమీక్షలో రాష్ట్రంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, నిర్వహణకు సంబంధించిన అంశాలపై

అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారు. పుష్కర ఘాట్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించడం, అవసరమైన ఏర్పాట్ల పురోగతిని ఈ సమావేశంలో సంబంధిత అధికారులతో చర్చిస్తారు. అనంతరం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ – ఆర్టీజీఎస్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. పాలనలో సాంకేతికత వినియోగం, ప్రజా సేవల మెరుగుదల, వివిధ శాఖల పనితీరుపై ఈ సమావేశంలో చర్చించనున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

తప్పిపోయిన మహిళలు, బాలికలను గుర్తించి వారి కుటుంబాలతో తిరిగి కలిపే కార్యక్రమంలో రాష్ట్ర పోలీసులు విశేష ఫలితాలు సాధిస్తున్నారని హోంమంత్రి వి. అనిత తెలిపారు. 'ఆపరేషన్ ట్రేస్' కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 4 వేల 655 మంది మహిళలు, బాలికలను గుర్తించి వారి కుటుంబాలతో తిరిగి కలిపినట్లు మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. తప్పిపోయిన వ్యక్తుల కేసుల్లో ఏ ఒక్కటి కూడా అపరిష్కృతంగా మిగలకుండా రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రత్యేక బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తూ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

---------------------------

గత 12 ఏళ్ల ఎన్డీయే ప్రభుత్వ హయంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గణనీయమైన ఆర్థిక సహాయం అందించిందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం నుంచి సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధి నుంచి సంక్షేమ కార్యక్రమాల వరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహకారం అందించిందని తెలిపారు. రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 15 వేల కోట్ల రూపాయల ప్రత్యేక సహాయం అందించగా, అమరావతికి రైల్వే అనుసంధానం కల్పించేందుకు కొత్త రైల్వే లైన్ నిర్మాణం కోసం 2 వేల 245 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుకు 2025 డిసెంబర్ నాటికి 20 వేల 658 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించే దిశగా ఎంఎస్ఎంఈ పార్కుల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లాలోని కొండకిండాం గ్రామంలో అభివృద్ధి చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కును మంత్రి నిన్న సందర్శించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశ్రామిక పార్కుల ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఏర్పడి ఈరోజుతో 12 సంవత్సరాలు పూర్తయ్యాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈ రోజు స్పందిస్తూ,

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వేర్వేరుగా ఏర్పడినా తెలుగు వారందరూ ఎప్పటికీ ఒక్కటేనని అన్నారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధిలో పరస్పరం పోటీపడి మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉభయ రాష్ట్రాలు భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని, రెండు రాష్ట్రాల ప్రజలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అలాగే అమరావతి, హైదరాబాద్ నగరాలు ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాలుగా ఎదగాలని పేర్కొన్నారు.

---------------------------

ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా భీమవరం నుంచి ఏసీ బస్సు సర్వీసులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పి. రామాంజనేయులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం కొత్త బస్టాండ్‌లో ఆయన ఈ రోజు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్‌లోని దుకాణాలు, క్యాంటీన్, సౌచాలయాలను పరిశీలించి, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలు విస్తృతంగా బస్సు సేవలను వినియోగిస్తున్నారని.. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో వస్తు, సేవల పన్ను - జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరిగాయని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ ఏ. బాబు వెల్లడించారు. మే నెలకు సంబంధించి రాష్ట్రంలో నికర జీఎస్టీ వసూళ్లు 3 వేల 37 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయని తెలిపారు. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 737 కోట్ల రూపాయలు అదనంగా వసూలై, 16 శాతం వృద్ధి నమోదు అయినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జీఎస్టీ వసూళ్ల పెరుగుదల 6 శాతంగా ఉండగా, దక్షిణాది రాష్ట్రాల్లో 16 శాతం వృద్ధితో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. రాష్ట్రంలో విలువ ఆధారిత పన్నులతో పాటు ఇతర పన్నుల వసూళ్లు కలిపి మే నెలలో మొత్తం 4 వేల 950 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు.

---------------------------

స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో చీరాల–పేరాల ఉద్యమానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన వ్యక్తి ఆంధ్ర రత్న బిరుదాంకితులు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి ఈరోజు. దుగ్గిరాల గోపాల కృష్ణయ్య ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో 1889 జూన్ 2న జన్మించారు. స్కాట్లాండ్లో ఎంఎ చదువు పూర్తి చేసుకొని తిరిగి భారత్ కు వచ్చిన గోపాల కృష్ణయ్య స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. నాటి బ్రిటిష్ ప్రభుత్వం చీరాల–పేరాల గ్రామాలను పురపాలక సంఘాలుగా చేసినప్పుడు పన్నుల భారం అధికం అవుతుందని ప్రజలను గ్రామాలు ఖాళీ చేయంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించారు. దీంతో బ్రిటిష్ ప్రభుత్వమే మున్సిపాలిటీని రద్దు చేసింది. చీరాల–పేరాల ఉద్యమ సారథిగా నిలిచిన గోపాల కృష్ణయ్య 1928 జూన్ 10వ తేదీన తుదిశ్వాస విడిచారు.

======================